రేపు జోడేఘాట్‌కు మంత్రి సీతక్క రాక
4

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 26 సోమవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 17 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

MONDAY OCTOBER 26 2026 | VOL:1 | ISSUE: 17 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

సైబర్ దాడులతో ఆర్థిక వ్యవస్థకూ ముప్పు!

సైబర్ యుద్ధాలపై ప్రధాని హెచ్చరిక



- దేశ ఆర్థిక మూలాలకు సైబర్ దాడుల ముప్పు
- బ్యాంకింగ్, డిజిటల్ వ్యవస్థల భద్రతకు ప్రాధాన్యం
- సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు ఆధునిక సదుపాయాలు అవసరం
- జన్‌ధన్ ఖాతాలతో కోట్లాది మందికి బ్యాంకింగ్ సేవలు
- కాంగ్రెస్ పాలనలో బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో పడిందని మోదీ విమర్శ

భువనేశ్వర్, అక్టోబర్ 25: యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే జరగవని, సైబర్ దాడుల ద్వారా కూడా ఒక దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచవచ్చని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. భువనేశ్వర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నూతన డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు, బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరగాళ్లు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

ఆధునిక సాంకేతికతతోనే ముప్పులకు అడ్డుకట్ట

ప్రస్తుతం ఎదురవుతున్న సైబర్ ముప్పులను పాతకాలపు పద్ధతులు, శిక్షణా పరికరాలతో ఎదుర్కోవడం సాధ్యం కాదని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పటిష్ఠమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలు, బ్యాంకింగ్ సేవల వినియోగం పెరుగుతున్న తరుణంలో వాటి భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

(మిగతా 2వ పేజీలో..)

ఎల్‌నినో ముప్పు.. రెండో పంటకు విరామం ఇవ్వండి!

- కఠినమైన కరువు వచ్చే అవకాశం.. మంత్రి పొంగులేటి హెచ్చరిక
- రైతులు రెండో పంట సాగుకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి
- సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వ చర్యలు
- భూగర్భ జలాలు తగ్గుతున్నాయి.. పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- ఢిల్లీలో ఓటర్ల జాబితాపై నిరసనకు కాంగ్రెస్ సన్నద్ధం
- ప్రణాళికాబద్ధంగా కరువును ఎదుర్కొంటాం

చుంచుపల్లి, అక్టోబరు 25: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కఠినమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తు రూపంలో ఎదురవుతున్న ఈ పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను కాపాడుతుందని భరోసా ఇచ్చారు. ఆదివారం

(మిగతా 2వ పేజీలో..)



'మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'.. బీజేపీపై రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు..!

: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఇండియా కూటమి నవంబర్ 1న రామ్‌లీలా మైదానం వరకు ర్యాలీ నిర్వహించతలపెట్టింది. అయితే ఈ ర్యాలీపై అధికార కూటమి నేతలు విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ ర్యాలీకి ప్రతిపక్ష కూటమి నేతలకంటే ఎక్కువగా బీజేపీ , దాని మిత్రపక్షాల నేతలే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

తమ ర్యాలీకి ఇంత ఉత్సాహంతో పెద్దఎత్తున పబ్లిసిటీ చేస్తున్నందుకు, ప్రోత్సహిస్తున్నందుకు బీజేపీ, దాని



(మిగతా 2వ పేజీలో..)

కన్నడ యువతకు ఉద్యోగాలివ్వకపోతే చర్యలు కఠినంగుంటాయ్ : డీకే శివకుమార్

కేంద్రంగా పనిచేసే ప్రైవేటు సంస్థలు ముఖ్యంగా ఐటీ కంపెనీల యాజమాన్యాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నట్లు తేలితే ఆయా సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని అన్నారు. బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారని తమకు



(మిగతా 2వ పేజీలో..)

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు: కేటీఆర్

- రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్
- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ
- సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్

(మిగతా 2వ పేజీలో..)



బంగాళాఖాతంలో వాయుగుండం

పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్, అక్టోబర్ 25

ఆగ్నేయ, తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గంటకు 5 కి.మీ వేగంతో కదులుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేం దం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతానికి ఇది విశాఖకు 870 కి.మీ,

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎల్‌నినో ముప్పు.. రెండో పంటకు విరామం ఇవ్వండి!

(మొదటి పేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల వంటివని పేర్కొన్నారు. గత రెండేళ్లలో దేశంలోనే అత్యధికంగా పంటల దిగుబడులు తెలంగాణలో నమోదయ్యాయని తెలిపారు.

రెండో పంట సాగుపై అప్రమత్తంగా ఉండాలి

ఈ ఏడాది మొదటి పంట పూర్తయిందని, రెండో పంట సాగుపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి వివరించారు. నీటి కొరత ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ ఏడాది రెండో పంట వేయకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వాతావరణ పరిస్థితులను, అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

తగ్గుతున్న భూగర్భ జలాలు

శీతాకాలం కొనసాగుతున్నప్పటికీ వేసవిని తలపించేలా ఎండలు తీవ్రంగా ఉన్నాయని పొంగులేటి పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు తగ్గుతుండగా, విద్యుత్ వినియోగం పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగులో ఉన్న పంటలకు అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వాలి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు కీలకమని పేర్కొంటూ, కేంద్రం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

ఓటర్ల జాబితాపై ఢిల్లీలో నిరసన

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పొంగులేటి తెలిపారు. ఈ అంశంపై నవంబరు 1న ఢిల్లీలో భారీ నిరసన, ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి 20 వేల మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, తొలగించిన ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని నిరసనకారులు డిమాండ్ చేయనున్నట్లు వివరించారు.


ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై దృష్టి

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు చేసుకునేందుకు ఇంకా 12 రోజులే మిగిలి ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రతినిధి వేగి వెంకటేశ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కన్నడ యువతకు ఉద్యోగాలివ్వకపోతే చర్యలు కఠినంగుంటాయ్ : డీకే శివకుమార్

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని డీకే ఎక్స్‌లో పోస్టు చేశారు. కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి ఇబ్బంది కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదని చెప్పారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందని అన్నారు. ఏదైనా ప్రైవేటు సంస్థ వారిని ఉద్దేశపూర్వకంగా పక్కనపెడితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.కన్నడిగులకు ఉద్యోగాల అంశంపై సోషల్ మీడియాలో ఇటీవల వీడియోలు వైరల్ అయ్యాయి. తాజాగా రెజ్యూమెలో భాష స్థానంలో కన్నడ అని ప్రస్తావించినందుకు తన దరఖాస్తును తిరస్కరించారని చెబుతూ ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా ట్యాగ్ చేశారు. ఇదే తరహా ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీఎం తీవ్రస్థాయిలో స్పందించారు.



సైబర్ దాడులతో ఆర్థిక వ్యవస్థకూ ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

గత దశాబ్దంలో బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న పేదలకు బ్యాంకు ఖాతాలు అందించడంపై దృష్టి సారించామని ప్రధాని తెలిపారు. రాబోయే దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ప్రజలకు సురక్షితమైన బ్యాంకింగ్ సేవలు అందించడంతోపాటు, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనపై మోదీ విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విధానపరమైన లోపాల కారణంగా భారత బ్యాంకింగ్ రంగం నిరర్థక ఆస్తుల సంక్షోభంలో చిక్కుకుందని మోదీ విమర్శించారు. 2014కు ముందు కాంగ్రెస్ నాయకుల సిఫారసులు, ఫోన్ కాల్స్ ఆధారంగా పెద్ద వ్యాపారవేత్తలకు వేల కోట్ల రూపాయల రుణాలు మంజూరయ్యేవని ఆరోపించారు. అదే సమయంలో సామాన్య ప్రజలు బ్యాంకు ఖాతా తెరవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనేవారని వ్యాఖ్యానించారు.

జన్‌ధన్ ఖాతాలతో నేరుగా లబ్ధి

1960, 70వ దశకాల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం బ్యాంకులను జాతీయాకరించినప్పటికీ, 2014 వరకు దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవని మోదీ పేర్కొన్నారు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఒడిశాలో మాట్లాడుతూ, ఢిల్లీ నుంచి రూపాయి పంపితే ప్రజలకు 15 పైసలే చేరుతున్నాయని వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం 59--60 కోట్లకు పైగా జన్‌ధన్ ఖాతాల ద్వారా ప్రభుత్వ సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు బదిలీ చేస్తున్నామని, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించగలిగామని మోదీ వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతోపాటు, డిజిటల్ లావాదేవీల భద్రతను కాపాడుకోవడం భవిష్యత్తులో కీలకమని ఆయన పేర్కొన్నారు.

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

రాహుల్ మౌనం వెనుక మర్మమదే

దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

2028లో కేసీఆరే మళ్లీ సీఎం

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

'మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'.. బీజేపీపై రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు..!

(మొదటి పేజీ తరువాయి)

మిత్రపక్ష పార్టీల నేతలకు కృతజ్ఞతలు రాహుల్‌గాంధీ తెలిపారు. రాబోయే 7 రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని వ్యంగ్యంగా అన్నారు. మరోవైపు నవంబర్ 1న నిర్వహించతలపెట్టిన నిరసన ర్యాలీలో పాల్గొనాలని విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులకు పిలుపునిచ్చారు.దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారని, ఈ అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, మౌనంగా ఉండబోమని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించి, నియమ నిబంధనలను ఉల్లంఘించారని విమర్శించారు. ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీలు ప్రయోగించారని, వాటన్నిటికీ ఇప్పుడు దేశం ప్రతిస్పందిస్తోందని అన్నారు. అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు రావాలని, ఓటు మీదే.. పోరాటం కూడా మీదేనని సోషల్ మీడియా ద్వారా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.ఇదిలావుంటే.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీలో అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆదేశాలు జారీచేశారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు సూచించారు. నవంబర్ 1న దేశరాజధానిలో నిర్వహించనున్న ర్యాలీలో దాదాపు 10 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఉండేందుకు కేంద్రం ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది.

బంగాళాఖాతంలో వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

కాకినాడకు 960 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని వెల్లడించింది. ఈ తుఫాను సోమవారం బలపడే అవకాశమున్నదని హెచ్చరించింది. ఈ వాయుగుండం 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా బలపడుతుందని తెలిపింది.ఈ క్రమంలో 28న ఈ వాయుగుండం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశమున్నదని పేర్కొన్నది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో ఈదురుగాలు లు వీస్తాయని వెల్లడించింది. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో అకడకడ తేలికపాటి వర్షాలు కురవవచ్చని, 27న కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా ఖమ్మం, భద్రాచ లం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి.. చలి క్రమంగా పెరుగుతున్నదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రెండ్రోజులు ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయే అవకాశమున్నదని పేర్కొన్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉన్నదని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శివారు ప్రాం తాల్లో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు చేరవచ్చని పేర్కొన్నారు. వాతావరణంలో జరిగిన ఈ మార్పుల నేపథ్యంలో ప్రజలు, పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

యాదవుల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్య పోరాటం అవసరం





- **భవిష్యత్ తరాల భవిష్యత్తు కోసం సామాజిక చైతన్యం పెరగాలి: బడుగుల నాగార్జున యాదవ్**
- **హుజూర్‌నగర్‌లో 'మన రిజర్వేషన్లపై -- సమాలోచన' ముఖాముఖి సమావేశం విజయవంతం**

హుజూర్‌నగర్, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

యాదవ సామాజిక వర్గ హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాల హక్కులను కాపాడుకోవాలంటే నేటి నుంచే సామాజిక చైతన్యంతో సంఘటితంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.హుజూర్‌నగర్‌లో యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో "రేపటి భవిష్యత్ తరాల కోసం... మన రిజర్వేషన్లపై -- సమాలోచన" అనే నినాదంతో నిర్వహించిన ముఖాముఖి సమావేశం విజయవంతమైంది. ఈ సమావేశంలో యాదవ సంఘాల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వక్తలు, సంఘం ప్రతినిధులు పాల్గొని రిజర్వేషన్ల పరిరక్షణ, సామాజిక హక్కులు, విద్యా--ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

హక్కుల పరిరక్షణకు అవగాహనే పునాది

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్ల చారిత్రక నేపథ్యం, ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, చట్టపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్య, ఉపాధి రంగాల్లో యువత ముందుకు సాగేందుకు మార్గదర్శకత్వం కల్పించడంతో పాటు, అర్హులైన వారికి అందుబాటులో ఉన్న అవకాశాలపై చైతన్యం కల్పించాలని అభిప్రాయపడ్డారు.సామాజిక అభివృద్ధి సాధించాలంటే సంఘటిత శక్తి, విద్యా ప్రగతి, రాజకీయ చైతన్యం కీలకమని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గానికి సంబంధించిన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధమైన మార్గాల్లో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సామాజిక ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

పలువురు సంఘం నాయకుల హాజరు

ఈ సమావేశంలో హుజూర్‌నగర్ పట్టణ యాదవ సంఘం నాయకుడు జక్కుల మల్లయ్య యాదవ్, యాదవ రాజ్యాధికార సాధన సమితి జిల్లా అధ్యక్షుడు గొల్ల మల్లికార్జున్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు వర్రె కవిత యాదవ్, హుజూర్‌నగర్ నియోజకవర్గ యాదవ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జక్కుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ కౌన్సిలర్ జక్కుల శంబయ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్,ా=ూా రాష్ట్ర కోశాధికారి గంధం లింగయ్య యాదవ్, గుడిమల్కాపురం సర్పంచ్ పుల్లేడి శ్రీనివాసరావు యాదవ్ పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యాయుడు జక్కుల శ్రీరామ్ యాదవ్, చిర్రా శ్రీనివాస్ యాదవ్, మద్దుల నాగరాజు యాదవ్, ముక్కెర్ల మట్టయ్య యాదవ్, జక్కుల కొండలు యాదవ్, జక్కుల నాగరాజు యాదవ్, లెక్చరర్ జక్కుల లక్ష్మణ్, పండగ కొరివి వీరయ్య యాదవ్, ఆవు దొడ్డి మహేష్ యాదవ్, చెవుల లింగయ్య యాదవ్, గోల కృష్ణయ్య యాదవ్, ఎల్లావుల శివశంకర్ యాదవ్, కుంటి గొల్ల నవీన్ యాదవ్ తదితర నాయకులు, యువత పాల్గొన్నారు.కార్యక్రమ విజయానికి సహకరించిన నాయకులు, ప్రతినిధులు, యువతకు యాదవ రాజ్యాధికార సాధన సమితి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు."మన హక్కులపై మనకు అవగాహన ఉండాలి.. మన భవిష్యత్ తరాల హక్కుల పరిరక్షణ కోసం మనమంతా ఐక్యంగా, బాధ్యతాయుతంగా కృషి చేయాలి" అనే సందేశంతో సమావేశం ముగిసింది.

జోడేఘాట్‌లో కుమురం భీం వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

- **వర్ధంతి కార్యక్రమానికి హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు.. సభా ఏర్పాట్లను సమీక్షించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**

జోడేఘాట్, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):

ఆదివాసీ వీరుడు కుమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని కెరమెరి మండలం జోడేఘాట్‌లో ప్రభుత్వం ఈనెల 26న అధికారికంగా నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి ఆదివారం పరిశీలించారు.ఈనెల 26న జరిగే వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, వేదిక ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన అంశాలను వారు సమీక్షించారు. కార్యక్రమానికి వచ్చే ఆదివాసీలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.భక్తులు, ప్రజల రాకపోకలకు ప్రత్యేక బస్సులువర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ఆదివాసీల రాకపోకలకు సౌకర్యంగా ఈనెల 26న హట్టి గ్రామం నుంచి జోడేఘాట్ వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపనున్నట్లు అధికారులు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ జాదవ్ అంబాజీ, కుమురం భీం సభ నిర్వహణ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, సర్పంచ్ ఆత్రం లక్ష్మన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుజియత్ ఖాన్, ఆర్జేపీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ కోవా ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కంచే చేను మేసిన చందం.. 12 కిలోల గంజాయితో పట్టుబడ్డ మహారాష్ట్ర కానిస్టేబుల్!

- **ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు.. రూ.6 లక్షల విలువైన గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు శాఖలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ గంజాయి అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన కానిస్టేబుల్ నితిన్ జ్ఞాను షిండే 12 కిలోల ఎండు గంజాయితో నెక్కొండ బస్టాండ్ సమీపంలో పోలీసులకు పట్టుబడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో నెక్కొండ బస్టాండ్ సమీపంలో ఎస్సై శ్రావణ్‌కుమార్, పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.తనిఖీల్లో నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, గంజాయి రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తులు, సరఫరా మార్గాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కంచే చేను మేస్తే.. కాపలాదారులే కంచె దాటితే? ప్రజల భద్రతకు బాధ్యత వహించాల్సిన పోలీసు సిబ్బందిపైనే ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే, కేసు దర్యాప్తులో వెల్లడయ్యే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



కాకతీయ యూనివర్సిటీలో నవంబర్ 28న 24వ స్నాతకోత్సవం

- **స్నాతకోత్సవ నిర్వహణకు పాలకమండలి ఆమోదం.. పట్టాల ప్రదానంపై కీలక నిర్ణయం**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

చారిత్రక కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవాన్ని నవంబర్ 28న నిర్వహించేందుకు వర్సిటీ పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (వీసీ), రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, విద్యార్థులకు పట్టాల ప్రదానం, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిసింది.పాలకమండలి ఆమోదంతో స్నాతకోత్సవ నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన విద్యార్థులకు డిగ్రీలు, ఇతర విద్యార్హతల పట్టాలు ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఇతర వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.



ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

- **గత పదేళ్ల పాలన.. ప్రస్తుత అభివృద్ధిపై చర్చకు సిద్ధం.. బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ నాయకుల సవాల్**

వేలేరు, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు విమర్శించారు.మల్లికుదుర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బిల్లా యాదగిరి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి సంపత్, కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ వేలేరు మండలంలోని వివిధ గ్రామాలకు సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. మండలంలో ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని, త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి గ్రామానికి బీటీ రోడ్ల నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. "కడియం శ్రీహరి అంటేనే అభివృద్ధి.. అభివృద్ధి అంటేనే కడియం శ్రీహరి" అని వ్యాఖ్యానించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. గత పదేళ్ల పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని అభివృద్ధి, పరిపాలన తీరుపై చర్చకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, దయాకర్, రాజు యాదవ్, భగవాన్, రవి, అంజయ్య, ఐలయ్య, రాకేష్ రెడ్డి, చిరంజీవి, రజినీకాంత్ యాదవ్, సురేష్, సారయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం

- **ఓటు హక్కు పరిరక్షణపై కాంగ్రెస్ నాయకుల సమావేశం.. పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బచ్చలకూరి కృష్ణ ప్రసాద్**

సూర్యాపేట, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



ఏఐసీసీ పిలుపు మేరకు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బచ్చలకూరి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ పరిశీలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాం భూపాల్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం ప్రాధాన్యత, ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ

స్వాతంత్ర్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ సేవాదళ్ కట్టుబాటు

జవహర్ నగర్, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



భారతదేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అయిన మువ్వన్నెల జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జవహర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ సేవాదళ్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ జనరల్ సెక్రటరీ కంతి రేణుక ఆధ్వర్యంలో, తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ జవహర్ నగర్ అధ్యక్షులు యాకచారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షఫీ ఉద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సాధనలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ, సేవాదళ్ చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్నారు. ప్రజాసేవ, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో సేవాదళ్ కార్యకర్తలు నిరంతరం ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సేవాదళ్ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవాదళ్ నాయకురాలు పడాల సంగీత, వర్కింగ్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి శకుంతల రెడ్డి, విజయరాయి, లలిత, రేణుక, సుకన్య, రాణి, లీలావతి, జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, జవహర్ నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, శాంతి కోటేష్ గౌడ్, రెడ్డి శెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సేవాదళ్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

మంచిర్యాల జిల్లాలో విషాదం.. నీటి కుంటలో పడి ముగ్గురు మృతి

- **బట్టలు ఉతికేందుకు వెళ్లి విగతజీవులైన వలస వ్యాపారులు.. ఇందారంలో విషాదఛాయలు**

మంచిర్యాల, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



మంచిర్యాల జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. జైపూర్ మండలం ఇందారం గ్రామ సమీపంలోని నీటి కుంటలో పడి ముగ్గురు వలస వ్యాపారులు మృతి చెందారు. బట్టలు ఉతికేందుకు నీటి కుంటలోకి దిగిన వారు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం.గ్రామానికి వలస వచ్చిన ఈ వ్యాపారులు అక్కడే నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ఆదివారం బట్టలు ఉతికేందుకు నీటి కుంట వద్దకు వెళ్లిన వారు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఒకేసారి ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో ఇందారం గ్రామ పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఘటనపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

కోదండరామపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

- **పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం: కాంగ్రెస్ నాయకులు**

గరిడేపల్లి, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



గరిడేపల్లి మండలం కోదండరామపురం గ్రామంలో ఈరోజు నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలకమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మచ్చ ముత్తమ్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పట్టెం సైదులు, మాజీ ఉపసర్పంచ్ మచ్చ రమేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు మంద బిక్షం, బత్తిని వెంకటయ్య, మంద కాంతయ్య, వార్డు మెంబర్ పోషం త్రివేణి, కోటిరెడ్డి, మాజీ వార్డు మెంబర్ వీరబాబు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మచ్చ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హంటర్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ ఢీకొని బైకర్ దుర్మరణం!

- **తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో ప్రమాదం.. ఉర్సులో విషాదఛాయలు**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డులో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో ఓ లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.ఈ ప్రమాదంలో ఉర్సు ప్రాంతానికి చెందిన ఆవునూరి రాజు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద వార్త తెలుసుకున్న స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకోవడంతో అక్కడ విషాదకర వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కలచివేశాయి.ఈ ఘటనతో ఉర్సు ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.


ఉమ్మడి వరంగల్ జిల్లాలో 38 కరువు మండలాల గుర్తింపు

- **ఖరీఫ్-2026లో కరువు ప్రభావం.. జిల్లాల వారీగా మండలాల జాబితా విడుదల**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి మొత్తం 38 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా అధికారులు గుర్తించినట్లు సమాచారం. కరువు ప్రభావంతో వ్యవసాయ రంగంపై ఆందోళన నెలకొనగా, మండలాల వారీగా కరువు పరిస్థితులను అధికారులు గుర్తించారు.జిల్లాల వారీగా పరిశీలిస్తే.. జనగామ జిల్లాలో ఒక మండలాన్ని తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతంగా, మరో మూడు మండలాలను మోస్తరు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు.అలాగే హనుమకొండ జిల్లాలో 11 మండలాలు, వరంగల్ జిల్లాలో 8 మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో 6 మండలాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 5 మండలాలు, ములుగు జిల్లాలో 4 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాల జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతుల్లో ఆందోళన.. సహాయక చర్యలపై ఆశలు



కరువు ప్రభావంతో పంటల సాగు, దిగుబడులపై ప్రభావం పడే అవకాశాలుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు అందే ప్రభుత్వ సహాయం, పంట నష్టాల అంచనా, తదుపరి చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. కరువు మండలాల గుర్తింపుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు అందనున్నాయి? పంట నష్టపరిహారం లేదా ఇతర సహాయక చర్యలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందన్నది వేచి చూడాల్సి ఉంది.

నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా!

- **వాటర్ ట్యాంకర్ల నిర్వహణపై జీడబ్ల్యూఎంసీ కఠిన నిబంధనలు.. రెండోసారి తప్పు చేస్తే రిజిస్ట్రేషన్ రద్దు**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాల నేపథ్యంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించే సమయంలో రోడ్లపై నీరు వృథాగా కారిపోతే సంబంధిత ట్యాంకర్ నిర్వాహకులకు రూ. 5 వేల జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు.నీటి సంరక్షణే లక్ష్యంగా ట్యాంకర్ల నిర్వహణలో నిబంధనలను మరింత కఠినతరం చేసినట్లు సమాచారం. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించనుండగా, అదే తప్పును రెండోసారి పునరావృతం చేస్తే సంబంధిత ట్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

లీకేజీలు ఉంటే నీటి సరఫరాకు అనుమతి నిరాకరణ

ట్యాంకర్లలో లీకేజీలు ఉన్నా, పైభాగంలో సరైన మూతలు లేకపోయినా వాటిలో నీటిని నింపేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. నీటి రవాణాలో ఎలాంటి వృథా జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ట్యాంకర్ నిర్వాహకులకు సూచించనున్నారు.

నవంబర్ 1 నుంచి ప్రత్యేక తనిఖీలు

నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు నవంబర్ 1వ తేదీ నుంచి నగరంలో ప్రత్యేక తనిఖీ బృందాలు పర్యటించనున్నాయి. ట్యాంకర్ల పనితీరు, నీటి రవాణా విధానం, లీకేజీల సమస్యలను పరిశీలిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోనున్నారు.తాగునీరు విలువైన వనరు కావడంతో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ట్యాంకర్ల నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి నీటి వృథాను అరికట్టాలని పేర్కొంటున్నారు.



వరంగల్‌లో ఘరానా చోరీ.. పుట్టినరోజు వేడుకల్లో బంగారం, నగదు అపహరణ!

- **బంధువుల ముసుగులో ఫంక్షన్‌లోకి ప్రవేశించి చోరీ.. రూ.45 వేల నగదుతో పాటు ఆభరణాలు మాయం**

హనుమకొండ, అక్టోబర్ 25(ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):

వరంగల్ నగరంలోని శివనగర్ పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో చోరీ ఘటన కలకలం రేపింది. బంధువుల ముసుగులో వేడుకల్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే.. సుందరయ్యనగర్‌కు చెందిన దిగోజు బ్రహ్మచారి మనవడు కార్తీకేయ మొదటి పుట్టినరోజు వేడుకలను శివనగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు కుటుంబ సభ్యులు, బంధువులు హాజరయ్యారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు తమ పర్సును హాల్‌లోని సోఫాపై ఉంచారు.ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు పర్సును అపహరించినట్లు బాధితులు పేర్కొన్నారు. ఆ పర్సులో 10 గ్రాముల బంగారు చైన్, కమ్మలు, పిల్లల ఉంగరాలు, వెండి వస్తువులతో పాటు రూ.45 వేల నగదు ఉన్నట్లు బాధితుడు వెల్లడించారు.



వేడుకల్లో అప్రమత్తత అవసరం

పుట్టినరోజు వేడుకలు ఆనందంగా సాగుతున్న సమయంలో చోరీ జరగడంతో బాధిత కుటుంబం ఆందోళనకు గురైంది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. నిందితులను గుర్తించి చోరీకి గురైన సొత్తును తిరిగి రాబట్టాలని బాధితులు కోరుతున్నారు.శుభకార్యాలు, వేడుకల్లో విలువైన వస్తువులు, నగదును నిర్లక్ష్యంగా ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

శబరిమల భక్తులకు అలర్ట్.. మండల యాత్ర వేళ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక నిబంధనలు!

- **అయ్యప్ప భక్తులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి.. ఫిట్‌గా ఉంటేనే సత్రం--పుల్లుమేడు అటవీ మార్గంలో ప్రయాణానికి అనుమతి**

హనుమకొండ, అక్టోబర్ 25(ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):

శబరిమల అయ్యప్ప స్వామి మండల దీక్షా యాత్రలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక నిబంధనలు తీసుకొచ్చినట్లు సమాచారం. యాత్రలో భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించింది.ఈ క్రమంలో వండిపెరియార్ సమీపంలోని వలర్దీ వద్ద ప్రత్యేక ఆన్‌లైన్ బుకింగ్ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్గంలో శబరిమలకు వెళ్లాలనుకునే భక్తులకు అక్కడ ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఆరోగ్య పరీక్షల తర్వాతే అటవీ మార్గంలో ప్రయాణం

సత్రం--పుల్లుమేడు అటవీ మార్గం సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉండటంతో పాటు ప్రయాణం కష్టతరంగా ఉండనుంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే భక్తుల శారీరక సామర్థ్యాన్ని పరిశీలించిన అనంతరం అనుమతించనున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు (హైబీపీ), ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న భక్తులు కఠినమైన అటవీ మార్గంలో ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని అధికారులు సూచించనున్నట్లు సమాచారం.



ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రత్యామ్నాయ మార్గం

ఆరోగ్య సమస్యలు ఉన్న భక్తులు సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉండే పంబా మార్గాన్ని ఎంచుకోవాలని సూచించనున్నట్లు పేర్కొన్నారు. అయితే మార్గాల దూరం, ప్రవేశ అనుమతులు, బుకింగ్ విధానం, ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక మార్గదర్శకాల ద్వారా నిర్ధారించుకోవడం భక్తులకు అవసరం. భక్తులకు సూచన: దీర్ఘదూరం నడకకు ముందు ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా పరీక్షించుకోవాలి. గుండె జబ్బులు, హైబీపీ ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా కఠినమైన కొండ, అటవీ మార్గాల్లో ప్రయాణించకూడదు.

రేపు జోడేఘాట్‌కు మంత్రి సీతక్క రాక

- **కుమురం భీం 86వ వర్ధంతి ఉత్సవాల్లో పాల్గొననున్న రాష్ట్ర మంత్రి**

కెరమెరి, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

ఆదివాసీ పోరాట యోధుడు, అమరజీవి కుమురం భీం 86వ వర్ధంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సోమవారం జోడేఘాట్‌కు రానున్నారు. ఈనెల 26న కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి మంత్రి హాజరుకానున్నట్లు ఆమె అధికారిక సిబ్బంది వెల్లడించారు.మంత్రి సీతక్క సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు జోడేఘాట్‌కు చేరుకుని, కుమురం భీం వర్ధంతి సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నారు.

ఆదివాసీ యోధుడికి ఘన నివాళులు



ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన కుమురం భీం వర్ధంతి సందర్భంగా జోడేఘాట్‌లో నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు, వివిధ ప్రాంతాల నుంచి భీం అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **మావినెల్లి కిషన్ నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

నగల్‌గిద్ద, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నగల్‌గిద్ద మండల పరిధిలోని మావినెల్లి కిషన్ నాయక్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ వేడుకలను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటిలోకి అడుగుపెడుతున్న కుటుంబాల ఆనందంలో పాలుపంచుకున్నారు.

అర్హులైన పేద కుటుంబాలకు అండగా ఉంటాం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, నిరుపేదలు ఆత్మగౌరవంతో, భద్రమైన వాతావరణంలో జీవించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం నిబద్ధతతో అమలు చేస్తోందని తెలిపారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలో పార్టీలు, వర్గాలకు అతీతంగా నిబంధనల ప్రకారం అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన తండాలు, మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని వెల్లడించారు.నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితాల్లో ఈ కొత్త ఇళ్లు సంతోషం, భద్రత, భవిష్యత్తుపై భరోసాను నింపాలని ఆకాంక్షించారు. వేదికల్లో పాల్గొన్న ప్రముఖులు ఈ గృహప్రవేశ మహోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా, దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. .కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

- **ప్రజలను వాతావరణ మార్పుల ప్రభావం నుంచి కాపాడేందుకు అప్రమత్తత అవసరం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **'ఓట్ బచావో -- దేశ్ బచావో', ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలపైనా నాయకులతో సమాలోచన**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- జిల్లా ప్రతినిధి):

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావం ప్రజలపై పడకుండా అవసరమైన అంశాలను ముందుగానే గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.కొత్తగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, ముందస్తు సన్నద్ధత, 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం, రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు అప్రమత్తత

రానున్న వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టడం, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడం వంటి అంశాలకు సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సన్నద్ధత అవసరమని చర్చించారు.

ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన

'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించే అంశాలను నాయకులు చర్చించారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల



భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమాలోచనలు జరిపారు.

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలపై చర్చ

రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్ర ఓటర్లతో సమన్వయం, ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన అంశాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పట్టభద్రులకు అవసరమైన సమాచారాన్ని అందించడం, ఎన్నికలపై అవగాహన కల్పించడం, నాయకులు సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలను ప్రస్తావించారు.ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఏఐసీసీ కోఆర్డినేటర్ మేడి వెంకటేశ్, పీసీసీ కోఆర్డినేటర్ దుద్దిళ్ల శ్రీనుబాబు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో కాషాయ సందడి.. ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం!

- **క్రమ-శిక్షణతో సాగిన పథసంచలన్.. గణవేష్‌లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**
- **సమాజ శ్రేయస్సుకు సమష్టి కృషి, సేవాభావమే కీలకం: వడ్డేపల్లి రాజేశ్వరరావు**

కూకట్‌పల్లి, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

కూకట్‌పల్లిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన పథసంచలన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గణవేష్ ధరించి పథసంచలన్‌లో పాల్గొన్నారు. కూకట్‌పల్లిలోని జెనెసిస్ స్కూల్ వద్ద ప్రారంభమైన పథసంచలన్ ఈస్ట్ కమాన్, తాండ్రపాపారాయుడు సెంటర్, పాత శివాలయం, రామాలయం, శేషాద్రి కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీల మీదుగా కొనసాగింది. అనంతరం తిరిగి జెనెసిస్ స్కూల్‌కు చేరుకుంది. సంఘ్ కార్యకర్తలు క్రమశిక్షణతో పథసంచలన్‌లో పాల్గొన్నారు.సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలి పథసంచలన్ అనంతరం ధ్వజ ప్రణామం, వక్తల పరిచయం, సందేశాలతో విజయదశమి ఉత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, సమాజంతో మమేకమై, సమాజ శ్రేయస్సు కోసం సమష్టిగా పనిచేయడమే పథసంచలన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, ఐకమత్యం, సేవాభావం, సామాజిక సమరసత



వంటి విలువలను ప్రజల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభ్యున్నతి కేవలం కొందరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించినప్పుడే సమాజం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. సేవా దృక్పథంతో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విజయదశమి ఉత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం సమష్టి కృషి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యం.. పలు గ్రామాల్లో టిఫిన్ బైఠక్‌లు!





- **ఇల్లందకుంట మండలంలోని ఆరు గ్రామాల్లో శక్తి కేంద్రాల వారీగా సమావేశాలు**
- **బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి హాజరు**
- **బండి సంజయ్ నాయకత్వంలో యువకుల ర్యాలీని విజయవంతం చేయాలి: పార్టీ శ్రేణులకు పిలుపు**

జమ్మికుంట, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల):

భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో ప్రజా సమస్యల గుర్తింపు, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడమే లక్ష్యంగా కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి నేతృత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో శక్తి కేంద్రాల వారీగా ఈ సమావేశాలు చేపట్టారు. సిరిసేడు, కనగర్తి, బుజునూర్, రాచపల్లి, ఇల్లందకుంట, మల్యాల గ్రామాల్లో నిర్వహించిన టిఫిన్ బైఠక్‌లకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యక్రమాలు, గ్రామస్థాయి సమస్యలు, సంస్థాగత అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి ఈ సందర్భంగా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో టిఫిన్ బైఠక్‌లు కీలకమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్యకర్తలను మరింత చైతన్యపరిచేందుకు ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించనున్న యువకుల ర్యాలీని విజయవంతం చేసేందుకు ఇల్లందకుంట మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి ర్యాలీ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డితో పాటు ఉప్పుల రమేష్, గుత్తికొండ రాంబాబు, ఇంగ్లే ప్రభాకర్, నల్ల లింగారెడ్డి, ఎండీ షఫీ, సామ కర్ణాకర్ రెడ్డి, చింతల ఐలయ్య, రామంచ సంపత్, ఆసాల సుధాకర్, ఉప్పు దుర్గయ్య, గుడికందుల పావని, సోమిడీ సురేందర్, మట్ట పవన్ రెడ్డి, గుత్తికొండ పవన్, జిల్లెల్ల శ్రీపాల్ రెడ్డి, ఇంగ్లే రమేష్, తిప్పరబోయిన సమ్మయ్య, ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, జోడు సంపత్, గురుకుంట్ల సంజీవ్, వడ్లకొండ జలపతి, పలకల కిషన్ రెడ్డి, చీపతి శ్రీకాంత్, రవీందర్, స్వామిదాస్, రావుల అశోక్, దేవునూరి లచ్చన్న తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్.. జంగల్.. జమీన్ నినాదం మళ్లీ మార్మోగనున్న జోడేఘాట్!

- **దర్బార్ స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు**
- **జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ వీరుడి ఆశయాలే భావితరాలకు స్ఫూర్తి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



ఆదివాసీ హక్కుల సాధన కోసం అణచివేతకు ఎదురొడ్డి పోరాడిన విప్లవ వీరుడు కుమురం భీం 86వ వర్ధంతి ఉత్సవాలకు జోడేఘాట్ ముస్తాబవుతోంది. ఈనెల 26న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దర్బార్ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణం, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఆదివాసీ హక్కుల పోరాటానికి చిరస్మరణీయ ప్రతీక కుమురం భీం జల్, జంగల్, జమీన్.. ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అడవి, భూమి, జల వనరులపై ఆదివాసీల హక్కుల కోసం కుమురం భీం సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు ఆయన ఆశయాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు స్థానికంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం ఆదివాసీ ఐక్యతకు, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది. పలువురు నాయకుల పాల్గొనడం ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మోడీ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్, తుమ్మగూడ సర్పంచ్ కుమురం భీంరావ్ పటేల్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల కమల్ రాజుకు కేటీఆర్, హరీశ్ రావు జన్మదిన శుభాకాంక్షలు

- **ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.. పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి ప్రశంసలు**
- **మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జికి పార్టీ అగ్రనేతల అభినందనలు**

మధిర, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి లింగాల కమల్ రాజు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వారు అభినందించారు. ప్రజలతో మమేకమవుతూ, పార్టీ



కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రజాసేవే లక్ష్యంగా మరింత ముందుకు..

పార్టీ నాయకత్వం అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం తనకు మరింత బాధ్యతను పెంచుతున్నాయని లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. కమల్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాజీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ నెల 27న హనుమకొండలో ఉమ్మడి వరంగల్ డీసీసీ బ్యాంకు మహాజన సభ

- **ఉదయం 11 గంటలకు సమావేశం.. సంఘాల సభ్యులు సకాలంలో హాజరుకావాలని సీఈవో విజ్ఞప్తి**

హనుమకొండ, అక్టోబర్ 25 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభను ఈ నెల 27న హనుమకొండలో నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని నక్కలగుట్టలో ఉన్న డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మహాజన సభ ప్రారంభం కానుందని వెల్లడించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది.బ్యాంకుకు సంబంధించిన కీలక అంశాలపై మహాజన సభలో చర్చించనున్న నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. సభ నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఈవో పేర్కొన్నారు. సభ్యుల హాజరు తప్పనిసరి మహాజన సభకు సంబంధించిన సంఘాల సభ్యులందరూ నిర్దేశిత సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఈవో వజీర్ సుల్తాన్ కోరారు.

